# ఇదే ఈనాటి కధ

## జి. శోభాపేరిందేవి

"నీలాకాశంలో చుక్కలు ఎన్ని వున్నాయా అని లెక్క పెడ్తున్నావా ప్రమద్వరా?"

ప్రమద్వర ఉలిక్కిపడింది.

టక్కున కళ్ళు వాల్చేసుకుంది. కళ్ళు వాల్చడం తోటే కంటి లోపల పొంచి వున్న నీటి బిందువు కూడా కిందకి జారి పడింది.



శాంతమ్మ ప్రమద్వర పక్కనే కూర్చుంది.

"మీరిద్దరూ రేపువెళ్ళి ఇళ్ళవేటలో పడండి" అంది శాంతమ్మ.

"....."

"అసలు ఈ పాటికే ఇల్లు మారిపోయి వుండవలసింది"

"....."

"మీ అమ్మా వాళ్ళు నీకిచ్చిన ఫర్నీచర్ కూడా నీతోపాటు తెచ్చేసుకుంటావనుకున్నాను"

"మనింట్లో అన్నీ వున్నాయి కదా అని తేలేదత్తయ్యా!" నసిగింది ప్రమద్వర.

"మీ ఇంట్లో ఏమీ లేవు కదా!"

"మా ఇల్లా?"

"అదే! రేపు మీరు అద్దెకి తీసుకోబోతున్న ఇంట్లోకి ఏమీ లేవు కదా"

ప్రమద్వర మాటిగా అత్తగారి కళ్ళలోకి చూసింది.

ఆవిడ ప్రవర్తన ఆ అమ్మాయికి మొదటి నుండీ విచిత్రంగానే వుంది.

ఆపేక్షగా మాట్లాడుతుంది.

కానీ... ఆమడ దూరంలో నిలబడ్తుంది.

కలువుగోలుగా వుంటుంది.

కానీ... కలిసి వుండాలని అనుకోదు.

దీన్ని బట్టి ఆవిడకి తన ప్రవర్తన ఏమీ నచ్చలేదన్నమాట.

అదీకాక తమది కులాంతర వివాహం. అందువల్ల ఆవిడకి తనని వుంచుకోవడం ఇష్టం లేదన్నమాట.

తన కారణంగా ప్రసేన్ తల్లి తండ్రులకి దూరమవుతాడని తను ఊహించలేదు.

కానీ ఇరు కుటుంబాలకీ ఇష్టమైతేనే తమ పెళ్ళి జరగాలని తను ఆశించింది.

ఆధునిక భావాలున్న అమ్మా నాన్నా అభ్యంతర పెట్టలేదు.

"మా అమ్మా నాన్నలకి అసలే అభ్యంతరం లేదు" అన్నాడు ప్రసేన్.

"నిజంగానే చెప్తున్నావా?" అని తను అడిగింది.

"అవును తల్లీ! నా కోసం వాళ్ళు ఎలాంటి విషయాన్నయినా ఒప్పుకుంటారు" అన్నాడు.

దీన్ని బట్టి అతన్ని సంతోషపెట్టడం కోసమే ఆవిడ ఈ పెళ్ళికి ఒప్పుకున్నారన్నమాట.

"నేనేదేదో మాట్లాడుతున్నాను. కానీ నువ్వీ లోకంలోనే లేవు. నిద్ర వస్తోందేమో వెళ్ళి పడుకో! ప్రసేన్‌కి ఇవాళ ఎలాగూ నైట్ డ్యూటీ కదా!" అనేసి శాంతమ్మ తన గదిలోకి వెళ్ళిపోయింది.

ప్రమద్వరకి ఆ రాత్రి నిద్రపట్టలేదు.

సినిమాల్లోలాగ తను కూడా మంచి కోడలిగా వుండాలి అని ఎంతో అనుకుంది.

ప్రసేన్ తల్లితండ్రులకి కూతురు లేని లోటు తీర్చాలని ఆశించింది.

కానీ జరిగినది పూర్తిగా విరుద్ధం!

ప్రద్వరకి ఏడుపు తన్నుకు వచ్చింది. ఏడుస్తూ, ఏడుస్తూ ఏ రాత్రికో నిద్రలోకి జారుకుంది.

** ** **

ఇల్లు కుదిరింది.

కొత్త దంపతులకి కావలసిన సామానంతా అమరింది.

ప్రమద్వర ప్రసేన్‌తో ప్రయాణమైంది.

వెళ్తూ వెళ్తూ ప్రసేన్ వైపు చూసింది. అతను దిగులుగా తల్లివైపు చూస్తున్నాడు.

శాంతమ్మ కళ్ళ నిండా కన్నీళ్ళు.

సెదవుల్లోకొట్టొచ్చినట్లుగా కనిపిస్తూ వుంది అదురుపాటు!

గభాల్న అత్తగార్ని సమీపించింది.

"అత్తయ్యా మీ అబ్బాయి వేరే కులానికి చెందిన అమ్మాయిని చేసుకోవడం వల్లే కదా మీకు ఇంత బాధ కలుగుతోంది" అంది ప్రమద్వర.

శాంతమ్మ ప్రమద్వర భుజమ్మీద చెయ్యి వేసి పక్కగదిలోకి తీసుకువెళ్ళింది.

"నేను నిన్ను కులం కారణంగా దూరంగా పంపిచేస్తున్నాననుకుంటున్నావు కదూ!

"కాదు...!"

జీవితంలో కొన్ని అనుభూతులు కొందరితోనే పొందాలి ప్రమద్వరా!

పిచుకలు రెండూ కష్టపడి గూడు కట్టుకుంటాయి. అంత కష్టపడి కట్టుకున్న గూట్లో ఎంతో వెచ్చగా ఒదిగిపోయి ఊసులాడుకుంటాయి. తర్వాత ఆడపిచ్చుక గుడ్లు పెడ్తుంది. మగపిచ్చుకేమో వాటన్నింటికీ ఆహారం తేవాలని తిరుగుతుంది. బాగా తిరిగి తిరిగి చివరికి ఆహారం సంపాదిస్తుంది. తర్వాత తల్లి దండ్రులైన పిచుకలు రెండూ తిరిగి తమ పిల్లల కోసం ఆహారం తెస్తాయి.

అంత ఆపేక్షగా వున్నా పిల్లలకి రెక్కలు రాగానే ఎగిరిపోతాయి. తల్లిదండ్రులైన పిచుకలు ఉత్సాహంగా వాటికి వీడ్కోలిస్తాయి.

ఇక్కడా అంతేనమ్మా!

అటు మీ అమ్మా నాన్నా, ఇటు మేము అడ్డంగా వస్తే మీ సంసారం సుఖాంతం కాదమ్మా!

మేము నలుగురం దూరంగా వుండి మా దీవెనలు మీకు అందిస్తూ వుంటాం!

ఇలా వుంటేనే ఈ కాలంలో సంసారాలు సజావుగా సాగుతాయి.

ప్రద్వర అత్తగారి పాదాల మీద పడిపోలేదు.

గుండెల్లో గువ్వలా ఒదిగిపోయింది. •